# "కన్నతల్లి"

పి. శ్రీదేవి

శ్రీ 'వెంపో' గారు రచించిన 'కన్నతల్లి' ఆంధ్ర కల్పనా సాహిత్యానికి క్రొత్తగా చేర్చబడిన నవల.

ఇతివృత్తం కేవలం సాంఘికం. ఉదాత్తమైన ఇతివృత్తాన్ని తీసుకుని వాస్తవికతకు వీలైనంత దగ్గరగా చక్కగా ఒద్దుకుంటూ పోగలిగారు రచయిత.

సామాన్యమైన మధ్యతరగతికి చెందిన రైతు కుటుంబం ఇతివృత్తానికి నెలవు.

చంద్రయ్య సామాన్యమైన రైతు అతనికి పెద్ద ఆశయాలూ లేవు, అత్యాశలూ లేవు. రైతుకు వ్యవసాయం మీద ఉండే మమకారం, ఆ వ్యవసాయానికి వారసుడు లేకపోతే భూమిని వదులుకోవలసి వస్తుందనే బాధ, తప్పితే అతనికి మరొక చింతే లేదు. చిన్నవాడైన సుందర్రావు మేధస్సులో మెదిలే జిజ్ఞాసను గ్రహించడతడు. అప్పటికే వయస్సు వచ్చిన పెద్ద కొడుకు స్కూలు ఫైనలు దాకా చదివిన చదువు వ్యర్థం కాకుండా ఉద్యోగంలో ప్రవేశిస్తాడు. ఒక కొడుకు ఉద్యోగస్తుడయాడు కదా అనే ముచ్చట ఎలాగూ తీరింది కనుక రెండవ కొడుకును తనకు వ్యవసాయంలో వారసునిగా తయారు చేయాలని చంద్రయ్యకు పట్టుదల ఆ పట్టుదలతోనే సుందర్రావు చదువుకు ప్రతిబంధకంగా నిలుస్తాడు

తెనాలిలో బ్రతుకుతెరువు గడువక వచ్చేసిన చంద్రయ్య తెలంగాణా భూమిని సేద్యంచేసి అదే ఉపాధిగా బ్రతుకుతూ, ఆ భూమే బంగారం పండి తన కుటుంబం మూడు పువ్వులూ ఆరు కాయలుగా విస్తరించి పోయేసరికి తెలంగాణాపై మరింత అభిమానం పెంచుకోటానికి బదులు సర్కారు జిల్లాలకు, తెలంగాణా ప్రాంతాలకు గల ఎక్కువ తక్కువలను గూర్చి ఎంపుడు చేయ మొదలు పెడుతాడు తరతరాలనుండి ఒక ఆధిక్యాన్ని తమలో తాము పెంపొందించుకుంటూ వచ్చిన సర్కారు రైతు కుటుంబాలకు వెనుకబడిన తెలంగాణా వంటి ప్రాంతాలపైగల చిన్న చూపును వ్యంగ్యంగా చూపించారు రచయిత.

సీతమ్మ ఉత్తమ యిల్లాలు. ఇద్దరు కొడుకుల తరువాత ఆడపిల్లను పోగొట్టుకున్న సీతమ్మ చిన్నవాడైన సుందర్రావు పైనే చనిపోయిన ఆడపిల్లపై గల మమకారాన్ని కూడా పెంపొందించుకున్నదనడం, కడుపు శోకమెరిగిన కన్నతల్లి మనస్తత్వాన్ని రచయిత యింపుగా చిత్రించారనడానికి ఒక మచ్చు తునక.

తండ్రిగా చంద్రయ్య సుందర్రావుపై పెంపొందించుకున్న అధికారాన్ని, తల్లిగా సీతమ్మ విస్తరింపచేసుకున్న మమకారం పటాపంచలు చేస్తుంది. సీతమ్మ మంచి మాటలతో చంద్రయ్య సుందర్రావుకు చదువుకునే అవకాశం కల్పిస్తాడు.

కథలో సీతమ్మ పాత్ర యింతే. ఇతివృత్తమంతా సుందర్రావు జీవిత కథపై ఆధారపడి ఉంది. సజీవమైన సీతమ్మ పాత్ర మనలనెక్కువ ఆకర్షించదు. కాని సుందర్రావు ఆత్మలో జీవించి ఉన్న సీతమ్మ హృదయం, సుందర్రావులోని మానవీయతను ప్రకాశింపచేసిన సీతమ్మ హృదయం, సుందర్రావు పాత్రలో అణువణువునా దాగిఉన్న సీతమ్మ ఔదార్యం-మనలను చకితుల్ని చేస్తుంది. ఇదే ఈ రచనకు ఆయువుపట్టు ఇతివృత్తంలోని ఉదాత్తత సుందర్రావు పాత్రది కాదు సుందర్రావు ఆత్మలో ప్రభాసితమైన మాతృ హృదయానిది.

పదమూడు సంవత్సరాల వయస్సు నాటి నుండీ సుందర్రావుకు చదువుకోవాలి అనే జిజ్ఞాస పెంపొందుతూ వచ్చింది. చదువుకోవాలి అనే జిజ్ఞాస పెరుగుతూన్న కొలదీ

అందుకు ప్రతిబంధకంగా నిలచే పరిస్థితులు ఎదుగుతూ వచ్చాయి. మేధస్సును విస్తరింప చేసికోవాలి అనే ఆసక్తి పెంచుకొన్న కొలదీ అందుకు అవకాశమిచ్చే వాతావరణం కుదించుకుని పోసాగింది

పరిస్థితుల ప్రాబల్యానికి నిస్సహాయంగా బలియైపోయి లోలోపలి జిజ్ఞాస అణగారిపోయిన మరచక్రపు మానవ జీవితాలను సమకాలీన వాతావరణంలో చూస్తూనేఉన్నాము అయితే సుందర్రావు విషయంలో ఆ జిజ్ఞాస అణిగిపోకుండా లోలోపల విజృంభిస్తూ వచ్చింది తనకుతానై ప్రయత్నించినన్నాళ్లు సుందర్రావు తనకు కావలసిన వాతావరణాన్ని సృష్టించుకోలేక పోయాడు.

కాని ఇరవైయేళ్ళ సుందర్రావును అంతవరకూ ఎదురుతిరిగిన పరిస్థితులే అప్రయత్నంగా ఇంకా బలవంతంగా ఒక క్రొత్తప్రపంచంలో పడవేశాయి. ఆ సరికొత్త ప్రపంచంలో సుందర్రావు అతను వాంచించే విద్యావిజ్ఞాన సముపార్జనలకు వలసినంత అవకాశం ఆదరణ పొందగలిగాడు

నిజానికి సుందర్రావు అదివరకే పెరిగాడు. అతని మానవీయతలోని పెరుగుదల అతని చిన్ననాడే ప్రారంభమైంది కేవలం అతనిలోని జిజ్ఞాసే దానికి తోడ్పడింది. వడ్లకొండ దాటి భాగ్యనగరం వచ్చిన తరువాత ఆ పెరుగుదలకు మరింత విస్తీర్ణత ఏర్పడింది. ఏమయితేనేం-మనిషి పరిపూర్ణుడు కావటానికి అనుభవంలేని ఆత్మ వికాసం చాలదని ఋజువు చేసికున్నాడు సుందర్రావు. సుందర్రావులో మానవత్వం "పరిస్థితుల నణగద్రొక్కి ఉత్తుంగ గిరి శిఖరాల్లా ఎదిగిపోయింది. ఆ శిఖరాల శిరస్సులు వంచటానికి ఇతరేతర శక్తుల సాధ్యమయ్యే పనికాదు." అలాంటి సుందర్రావు, మానవత్వపు అట్టడుగున కోలాహలం చేసే ఆశలూ అభిలాషలకూ దూరమయి పోయాడు. ఆ అభిలాషలకు లొంగిపోతూన్న గౌరిని కాపాడుకోలేకపోయాడు. గౌరిని గౌరిగా ప్రేమించలేక సీతమ్మగా ఆదరించేడు.

సుందర్రావులో ఈ విచిత్ర మానసిక స్థితిని చక్కగా ఇమడ్చగలిగారు రచయిత.

స్వార్థం లేనిదే జిజ్ఞాస రేకెత్తదు "నేనేదో తెలుసుకోవాలి నేనింకా నేర్చుకోవాలి ఆత్మ వికాసం పొందాలి". అనేదే మనిషి కుండదగిన స్వార్థం ఆ స్వార్థం సుందర్రావులో ఇనుమడించింది బలవంతంగా సంసారంలో నెట్టబడిన సుందర్రావుకు ఆ స్వార్థం దెబ్బతిన్నది. ఆ నిస్పృహలో గౌరి విషయమే పట్టలేదతనికి ఆమె ఆశ లతనికి అర్థంకావు ఆమె కల లతని ఊహలోకి రావు అందుచేతనే గౌరిని భార్యగా గుర్తించనే లేకపోయాడు.

గౌరికి వయస్సుతో పెరిగిన ఆశయాలు అనుభవంలో అడియాసలైనాయి

"కలలలో ఊహించుకొన్న ఆ వాస్తవ ప్రపంచంలోనే ఆమె ప్రణయానురక్తి పరిపూర్ణత్వాన్ని సాక్షాత్కరించింది సముద్రంలో కలవనంత వరకే నదుల పరవళ్లు వాటి శోభ కూడా అంతవరకే" (96వ పేజీ)

వెలితిపడ్డ సుందర్రావు హృదయం తల్లిలేని కొరతకు బాధపడింది. సంక్షుభిత హృదయుడైన సుందర్రావుకు గౌరి స్త్రీ మూర్తిలో మాతృత్వము గోచరించింది. ఆమె ఆదరణలో తల్లి హృదయం విదితమైంది. ఆమె ఆపేక్షలో తల్లి ఆరాటమే విశదమైనది ఆమె అతని యెడల చూపే అనురక్తిలో అతనికి మాతృవాత్సల్యపు రుచి నెమరుకు వచ్చింది. అదే అతని గాయపడిన హృదయానికి ఓదార్పు నిచ్చింది.

యౌవనపు కోరికలతో బరువెక్కిన గౌరి హృదయం "ఇంద్రియ లోలనత్వం కనరాని అతని కౌగిలిని అర్థంచేసికొని సంబాళించుకుంది" (102 వ పేజీ) అంతేకాదు, "ఏదో ప్రియతమమైన వస్తువునుండి విడదీయబడినట్లు వ్యసనపడసాగింది" అన్నారు.

గౌరి చదువుకున్నదికాదు. తెచ్చిపెట్టుకున్న సంస్కారమేమీ లేదామెలో. ప్రయత్నపూర్వకంగా విస్తృతం చేసికొన్న వికాసమూ లేదామెలో. అయినా సుందర్రావు నర్థంచేసికొన్నది. అత డామెలో చూడగలిగిన మాతృత్వానికి బాసటగా నిలువగలిగింది. స్త్రీ హృద

యంలోని మాతృత్వాన్ని రచయిత ఎంత నిశితంగా దర్శించారో, ఎంత సుందరంగా చిత్రించారో 110, 111, 112 పేజీలలోని సుందరరావు గౌరిమధ్య జరిగిన సంఘర్షణను వర్ణించిన తీరు చెపుతుంది వారిద్దరి మధ్యగల సంఘర్షణను వర్ణంరాబోయే ముందు వేసే చల్లనిగాలిలా పాఠకుని మనస్సును నొప్పించకుండా సున్నితమైన భావనతో చిత్రించారు. ఆహ్లాదంగా చదువుకు పోతూనే ఆ మానసిక సంఘర్షణల గాలి ఒరపిడికి ఊగిసలాడుతాము. విభిన్నమైన శారీరక, మానసిక ప్రవృత్తుల మధ్య గౌరి సుందరరావులను చిత్రించిన విధానం రచనలోని వాస్తవికతకు పరిపూర్ణ స్థాయి నిచ్చింది.

ఇతివృత్తాన్ని రచయిత తా నాశించిన గమ్యానికి చేర్చడానికి గంగాధరరావు, సుబ్బులు, కోటిలింగం, శివానందం మొదలైన పాత్రలు అవసరమయాయి అవసరమైనంత వరకూ ఆయా పాత్రలను సవ్యంగానే ఉపయోగించుకున్నారు. కాని ఇతివృత్తాన్ని మలుచుకొనిన పద్ధతి అక్కడక్కడ ఆమోదకరంగా లేదు. ఉదాహరణకు గౌరిని సుందరరావు జీవితంలో ఇమడ్చటానికి గంగాధరరావు కల్పించుకొన్న కారణం తృప్తికరంగాలేదు

తన కిష్టమైన గౌరిని తాను పొందలేని కారణంగా ఆమెను తన మరదలును చేసికొని పొందగోరడం అసహజం తన కీర్తాళువైన తమ్మునికి అంత అందమైన తానుకోరిన గౌరి నియ్యబూనటమే కొంత అసహజం.

"అతని ఆలోచనలు సుందరరావుపై దెబ్బ తియ్యాలని ఉన్నా, మనస్సులో ఒకమూల గౌరి మెదుల్తూనే ఉంది. ద్వేషాన్ని యిద్దరిలో ఎవరి పైనో ఒకరి పైన కేంద్రీకరించలేక పోయాడు చివరికి గౌరి సుందరరావులపై సమంగా అతడు ద్వేషాన్ని పంచాడు. తలవని తలంపుగా గంగాధరరావు వాళ్ళిద్దరికీ ఏదో సంబంధమున్న దనుకున్నాడు. వాళ్ళిద్దరికీ వివాహం చెయ్యాలనే ఆలోచన అతని బుర్రలో తటిల్లని మెరిసింది." (76వ పేజీ.) ఈ సంఘటన వలన అంతవరకూ సమతలంలో నడిచిన కథ ఒక్క సారిగా ఎగుడు దిగుడు బాటలోనికి దారి తప్పినట్లయింది. గౌరిని ఇతివృత్తంలోనికి ప్రవేశింపచేయటానికింత అసహజ వాతావరణాన్ని కల్పించ నక్కరలేదు

అలాగే గౌరి విషయంలో గంగాధరం ప్రయత్నాలను సమర్థించడంలో చివరిదాకా రచయిత కొంత అవాస్తవిక వాతావరణాన్ని సృష్టిస్తూ వచ్చారు.

గంగాధరరావుది దుష్టబుద్ధి అనటానికి సందేహంలేద్దు. ఆ బుద్ధిని బాహాటంగా చూపటానికి జంకిపోయారు రచయిత - రాత్రి పది గంటలయిన తరువాత కాని తమ్ముడు ఎలాగూ యింటికి రాడని తెలిసిన గంగాధరరావు గౌరిపై తనలో చెలరేగే కోరికలను తీర్చుకునేందుకు సినిమాకు పోయే అవసరం అర్థంకాదు తన ఆతురతను నివేదించడానికి సినిమా హాలు కన్న ఇల్లే పదిలం కదా!

రచయిత చెప్పదల్చుకున్నంతా సుందరరావు పాత్రద్వారా వ్యక్తమయి పోయింది ఇంక ఎలాగో కథ ముగించేయాలి అన్న తొందర పాటు కథాంతంలో కన్పిస్తూంది ముగింపు ప్రకరణంలో అసహజమైన నాటకీయత కన్పిస్తూంది అంతవరకూ చిత్రితమయిన పాత్రలన్నీ అప్రయత్నంగా రంగంపైకి రావటం చదువరి మనస్సులోని ప్రశాంతతను భంగపరస్తుంది ముగింపు ముదావహంగా లేదు.

"సుందరరావుకు చేసిన మోసానికి ప్రతి చిహ్నమైన నాలుగు మాసాల నలును గౌరి గర్భకుహరాన్ని ఛేదించుకుని భూపతనమై పోయింది" అనటం చాలా అసహజంగానూ అనవసరమైన కల్పనగానూ తోస్తుంది. తప్పు చేసిన గౌరిని సుందరరావు క్షమించగలిగిన నాడు తత్ఫలితంగా ఆమెలో పెరుగుతూన్న శిశువును అకారణ మరణానికి గురిచేయటం సమర్థనీయంకాదు

172 పేజీల ఈ చిన్న నవల మొదటి పుట చదవగానే చివరిదాకా ఆసక్తితో చదివిస్తూంది పుస్తకం ఎత్తుగడలోనే మొదటి ప్రకరణం వ్రాసిన విధానం ఆకర్షణీయమైనది పాత్రల

చేత చెప్పించినది కాక, రచయిత తానుగా చెప్పదల్చుకున్న విషయాలు ఏడెనిమిది చోట్ల ఒకటిన్నర పేజీలకు మించి దీర్ఘమైన, ఉపన్యాస ధోరణిలో సాగినవి అయినా భాష లోని మాధుర్యంచేత అంత విసుగు పుట్టించ లేదు

ఇంత చిన్న పుస్తకంలో చెప్పదల్చుకున్న విషయం ఎంత సుందరమైనదైనా పునరుక్తి పాటించడం మెచ్చదగినది కాదు

ఇటువంటి చిన్నచిన్న దోషాలను మినహా యిస్తే "చక్కని రచన చేశారు" అని రచయితను అభినందించి, ముగించే ముందు మరొక్క విషయం ప్రస్తావించి ముగిస్తాను.

స్త్రీ పాత్రను చిత్రించటంలో అనూహ్యమైన పదజాలంతో అభూత కల్పనలు చేసి, అనర్థ కరమైన రచనలు అపారంగా సాగిపోతూన్న ఈ కాలంలో స్త్రీత్వంలోని బలహీనతలన్నీ ఆకళింపుచేసికుని, ఆ బలహీనతలన్నిటి వెనుక దాగి ఉన్న బ్రహ్మాండమయిన మాతృత్వపు సౌందర్యాన్ని రచయిత సాక్షాత్కరింపచేసుకున్న విధానం; ఆ సౌందర్యం మానవుని మానవీయ గుణాలను పెంపొందించడానికి ఎలా తోడ్పడు తుందో చిత్రించిన విధానం, ప్రత్యేకంగా అభినందనీయం. ★

# స్వీయ సంగీతం

*మాదిరాజు రంగారావు*

సప్త వర్ణ విచిత్ర సంకేతాల
ఐవేండ్ల క్యాలెండరు బాబూ!
మీ చల్లని నోటిమాటయే
దీని పచ్చని జీవితం విలువ!
నడవలేని చీకటి కంబంలా
నిల్చిన మీ తలపై మేముంచిన
ఎర్రని వెలుగు రంగు దీపాలు
ఈ చిత్రంలో చూడవచ్చు.
జలతత్వంలా ప్రాకిపోవు
కులతత్వాలకు కట్టిన
చిన్ని చిన్ని ఆనకట్ట లెన్నో
ఈ చిత్రంలో చూడవచ్చు.
రెండో పండక్కి కొత్తదుస్తులు
తొడిగిన పాత విగ్రహాలం
రంగు రంగు కాగితపు పూ
లతికిన గుండెల మోడులం
మొగిలుపూల దండల నలంక
రించుకున్న పెద్ద కొండలం
స్వయం చలన శక్తిలేని
బ్రహ్మరథం చక్రాలం
భక్త సమాజం కోరే మార్గం
మా యోగక్షేమాలకు ధ్యేయం
క్రియాచరణలో మాత్రం
మేముసర్వదా, దర్పణప్రాయులం.
కోటి కోటి దేవతల స్థానం
మీ రెన్నుకున్న మాకే ఖాయం
ఈ లఘు చారిత్రిక పరమార్థం
మన * మత పవిత్రతకు చిహ్నం.
ప్రజల మేధాశక్తి స్పందన,
భవిష్యత్తు భారమితి చూపే
మా జీవిత స్థాయికి సూచన
మీ జ్ఞాన సంపదకు నిదర్శన.
మా మెళ్ళో మీరేసే పూదండలు
మీ కళ్ళకు మే మిచ్చే రంగద్దాలు
మన యిద్దరి ముఖాలు ఫోటోలో
మా ప్రభుతను గురించి పత్రికలో
రంగు పులుముకున్న ప్రతివాడూ
నటనార్హుడుగా, తలచినట్లు
మా చొక్కా వేసిన ప్రతివాడూ
బుద్ధి జీవుడను మాటకు అర్థం
భవిష్యత్తు వీణా దండానికి
మీ సదయ వాయుతంత్రులు
బిగిస్తే, "మేమే" పాటలుపాడుతాం
నమస్తే! మీరంతా కూర్చునివినండి.

* అభిప్రాయం.